ఎన్‌ఏడీలో కమ్ముకున్న చీకటి..!

- ఫ్లై ఓవర్‌పై వెలగని విద్యుత్ లైట్లు
- రాత్రి వేళ ప్రయాణానికి ఇబ్బందులు
- తరచూ ఇదే చోట ప్రమాదాలు
- పట్టించుకోని వీఎంఆర్‌డీఏ అధికారులు



బిర్లా జంక్షన్ వైపు వచ్చే దారిలో అంతంతమాత్రంగానే వెలుగులు



గాజువాక ప్రాంతానికి వెళ్లే దారిలో విద్యుత్ లైట్లు వెలగక అంధకారం

విశాఖ విద్య: విశాఖ నగరంలో ఎంతో కీలకమైన ఎన్‌ఏడీ కూడలి నిత్యం జనంతో రద్దీగా ఉంటుంది. అటువైపు గాజువాక, ఇటు బిర్లా జంక్షన్ మరో వైపున పెందుర్తి నుంచి, ఇంకో వైపున మర్రిపాలెం రోడ్‌లో వచ్చే వారంతా ఎన్‌ఏడీ సెంటర్ మీదగానే రాకపోకలు సాగిస్తుంటారు. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఎన్‌ఏడీ సెంటర్‌లోనే ఆర్టీసీ బస్సులు ఎక్కుతారు. ఎన్‌ఏడీ చుట్టూ ఉన్న విద్యా సంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు విధులకు రాకపోకలు సాగించే ఉద్యోగులు, కార్మికులతో వాహనాల రద్దీ కూడా ఎక్కువగానే ఉంటుంది. ఫ్లై ఓవర్ నిర్మాణం తర్వాత ప్రయాణం సాఫీగా సాగిపోతుందనుకున్న వాహనదారులు, ప్రయాణికులకు ప్రస్తుత పరిణామాలు తీవ్ర అసౌకర్యంగా మారాయి.

ప్రమాదాలు జరుగుతున్నా చర్యలు శూన్యం

ఫ్లై ఓవర్‌కు అనుకొని గాజువాక వెళ్లే దారిలో ప్రస్తుతం ఆర్‌వోబీ పనులు జరుగుతున్నాయి. దీంతో ఆ దారిలో హైవేపై డివైడర్లు ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో ఒక్కోసారి పొక్లెయిన్‌తో నిర్మాణ పనులు చేస్తున్నారు. కానీ ఇక్కడ రహదారిపై ఎటువంటి సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులకు ఇబ్బందిగా ఉంది. అసలే చీకటిగా ఉండటంతో, రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్లు దాటుకుని వెళ్లే చోట తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఫ్లై ఓవర్‌పై ఇటీవల కాలంలో పలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఫ్లై ఓవర్‌పై పూర్తి స్థాయిలో కాంతినిచ్చేలా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.



గాజువాక నుంచి ఫ్లై ఓవర్ పైకి వచ్చే దారిలో..

మందుబాబులకు అడ్డా

ఫ్లై ఓవర్ వద్ద విద్యుత్ దీపాలు సవ్యంగా వెలగకపోవడంతో చీకటి పడగానే మందుబాబులు చిందులేస్తున్నారు. ఎన్‌ఏడీ కూడలికి సమీపంలోని బెల్ట్ షాపుల్లో లభిస్తున్న మద్యం కొనుగోలు చేసుకుంటున్న మందుబాబులు ఫ్లైఓవర్ కిందనే కూర్చొని తాగుతున్నారు. వారి చేష్టలతో అటుగా వెళ్లే పాదచారులు, ముఖ్యంగా మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి విద్యుత్ దీపాలు వెలిగేలా తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వెలుగునివ్వని దీపాలు

ఫ్లై ఓవర్‌కు నాలుగు వైపులా ఉన్న రహదారుల్లో వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. మొదట్లో ఈ దీపాలు వెలుగులు విరజిమ్మాయి. దీంతో రాత్రయినా పగటి పూటలా ప్రయాణం సాగిపోయేది. కానీ ప్రస్తుతం విద్యుత్ దీపాల కాంతులు తగ్గిపోయాయి. లైట్లు వెలుగుతున్నా, రహదారిపైకి కాంతి కనిపించకపోవడంతో వాహనాల ప్రయాణానికి ఇబ్బందిగా మారింది. హైవేపై రయ్‌మని వచ్చే లారీలు, ఇతర వాహనాలను దాటుకుని వెళ్లేందుకు ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు కొన్ని రోజులకే కాంతిహీనంగా మారడంతో వాటి నాణ్యతపై అనేక సందేహాలు వ్యక్తమౌతున్నాయి. తమ సమస్యలను అధికారులకు విన్నవించినా, పరిష్కరించడం లేదని వాహనదారులు అంటున్నారు.

మాజీ సీఎంకు ఘన స్వాగతం



వైఎస్ జగన్‌తో పార్టీ నేతలు

విశాఖ విద్య: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విశాఖ వచ్చిన సందర్భంగా గురువారం ఎయిర్‌పోర్టులో పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆల్గా కృష్ణ ఎయిర్ పోర్టులో జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు కృష్ణ తెలిపారు.

ఏయూ విభాగాల్లో రెక్టార్ తనిఖీలు

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీలోని పలు విభాగాలను గురువారం రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్య, తత్వశాస్త్రం, ఇంగ్లిష్, లైబ్రరీ, ఇన్ఫర్మేషన్ సైన్స్, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హిస్టరీ అండ్ ఆర్కియాలజీ, ఆంత్రోపాలజీతో సహా పలు విభాగాలను సందర్శించారు. విద్యార్థులందరూ తరగతులకు హాజరవుతున్నారని, కళాశాల వేళల్లో డిపార్ట్‌మెంట్‌లలో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పూర్తి స్థాయిలో ఉండటంతో సంతోషం వ్యక్తం చేశారు. ఆయా విభాగాల్లో విద్యార్థులకు అందిస్తున్న బోధనను రెక్టార్ ప్రత్యక్షంగా పరిశీలించారు.

క్లుప్తంగా

కృష్ణాలయంలో ప్రత్యేక పూజలు



లలితా పారాయణ చేస్తున్న మహిళలు, చిన్నారులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గొల్ల వీధిలోని కృష్ణాలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీవిజ్ఞాన మండలి యాదవ్ సంఘం పాలక సభ్యుల ఆధ్వర్యంలో యాదవ సామాజిక వర్గ మహిళలు కృష్ణుడి ఉత్సవ విగ్రహానికి పాలు, పెరుగులతో అభిషేకాలు చేశారు. అనంతరం వారు గోవింద నామాలు జపించి, లలితా సహస్ర నామ పారాయణం పఠించారు. స్థానిక చిన్నారులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

విశాఖ విద్య: గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. కొత్తపాలెం, వెంకటాపురం సబ్‌స్టేషన్ల పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు సూర్యనగర్, నాగేంద్ర కాలనీ, సంతోష్ నగర్, డీఏఆర్ నగర్, కొత్తపాలెం జంక్షన్, గణేష్ నగర్, గోపాలపట్నం బంకు ఏరియా, నరసింహనగర్, ఇందిరా నగర్, గోపాలపట్నం మెయిన్ రోడ్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

27న వైద్య శిబిరం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మార్కెట్ లైన్ వద్ద ఈ నెల 27న మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. లయన్స్ క్లబ్, మల్కాపురం నగరాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిబిరాన్ని పారిశ్రామిక ప్రాంత రోగులు వినియోగించుకోవాలని నిర్వాహకులు సూచించారు. మాధవ్‌బాగ్ ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్య శిబిరం నిర్వహిస్తారని తెలిపారు.

అప్రెంటిస్‌షిప్ మేళా నేడు

అగనంపూడి: హైదరాబాద్‌లోని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ కంపెనీలో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి శుక్రవారం ఉదయం 9గంటలకు లంకెలపాలెం సమీపంలోని హైటెక్ ఐటీఐలో అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్టు హైటెక్ ఐటీఐ ప్రిన్సిపాల్ దుర్గునాయుడు తెలిపారు. ఈ మేళాలో వంద ఫిట్టర్, 40 పెయింటర్, 30 మిషనిస్ట్ ఖాళీలు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. అప్రెంటిస్ సమయంలో నెలకు రూ.11వేలు, శిక్షణ పూర్తి అయిన తరువాత కొనసాగేవారికి నెలకు రూ.17వేలు వేతనంగా చెల్లిస్తారని తెలిపారు. శిక్షణ సమయంలో భోజనం, రవాణా చార్జీలు చెల్లిస్తారన్నారు. 18 నుంచి 24 సంవత్సరాల వయసు గల స్త్రీ, పురుషులు అర్హులని పేర్కొన్నారు. ఐటీఐ అప్రెంటిస్ శిక్షణ ఒక సంవత్సరం ఉంటుందని, శిక్షణ పూర్తయిన తరువాత నేషనల్ అప్రెంటిస్ ట్రేడ్ సర్టిఫికెట్‌ను ప్రభుత్వం ద్వారా మంజూరు చేస్తారని తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటాతో పాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, పదో తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఐటీఐ ఉత్తీర్ణత పత్రాలతో హాజరు కావాలని పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్య

మర్రిపాలెం: ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బెహరా రీత (23) భర్త, కుమారుడితో కలిసి గోపాలపట్నంలో నివసిస్తుండేవారు. ఆమె డ్రైక్లీనింగ్ షాప్‌లో పనిచేస్తుండగా... భర్త డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. గురువారం ఉదయం గొల్ల కంచరపాలెంలో నివసిస్తున్న సోదరి ఇంటికి రీత వెళ్లింది. అదేరోజు సాయంత్రం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొద్దిసేపటి తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. అప్పుల బాధ తాళలేక రీత ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు.

వీధి కుక్కలతో భయం.. భయం

61వ వార్డులో స్థానికులపై దాడులు



వీధి కుక్కల దాడిలో వ్యక్తి కాలిపై గాయం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డులో వీధి కుక్కల బెడద అధికమైంది. దారిన పోయే వారిని గాయపరుస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. వీటిని నియంత్రించడంలో అధికారులు విఫలమయ్యారని ఆయా ప్రాంతాల వాసులు ఆరోపిస్తున్నారు. మల్కాపురం పరిసర ప్రాంతాల్లో గురువారం సాయంత్రం విచ్చలవిడిగా సంచరించిన వీధి కుక్కలు పలువురిపై దాడి చేశాయి. మల్కాపురం మార్కెట్ సెంటర్‌కు వస్తువులు కొనుగోలు చేసేందుకు వచ్చిన కృష్ణ అనే వ్యక్తిపై, స్కూల్ నుంచి ఇంటికి వెళ్తున్న రామ్‌సాగర్ అనే బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. వ్యక్తి, బాలుడు కాళ్లపై గాయాలు కావడంతో వారిని కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయిస్తున్నారు. వీధి కుక్కల బెడద ఒక్క మార్కెట్ సెంటర్‌కే పరిమితం కాలేదు. పల్లి వీధి, గొల్ల వీధి, గాంధీజీ వీధి, ప్రకాష్‌నగర్, జనతా కాలనీ మొదలగు ప్రాంతాల్లో అధికంగా ఉంది. రాత్రి వేళల్లో కొంత మంది కర్రలు పట్టుకుని ఇళ్ల నుంచి బయటకు వచ్చే పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు ఈ సమస్యపై దృష్టి పెట్టి కుక్కల దాడుల నుంచి కాపాడాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

సాయిబాబాకు హారతి సేవ



పూజలందుకున్న సాయిబాబా

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్ ఈబీ కాలనీ శ్రీ షిర్డీ సాయి ధ్యానమందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం బాబాకి పంచామృతాలతో అభిషేకం జరిపించారు. ప్రత్యేక అలంకరణ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. బాబాని దర్శించుకున్న భక్తుల గోత్రనామాలతో అర్చకులు పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం బాబాకి ప్రత్యేక హారతులు ఇచ్చారు. సాయి సంకీర్తనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పల్లకీ సేవ వైభవోపేతంగా జరిపించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు విళ్లా సత్యనారాయణ రావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

ప్యాకేజీల పేరుతో కుట్ర

- యాజమాన్యంతో కలిసి కేంద్ర ప్రభుత్వం కుయుక్తులు
- ఉక్కు సిటూ నాయకుడు రామారావు
- 1,351వ రోజుకు రిలే దీక్షలు



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న రామారావు

అగనంపూడి: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా చేపడుతున్న ఉద్యమాలనే నీరుగార్చేందుకు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంతో కలిపి కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీల పేరుతో కుట్రలు చేస్తోందని విశాఖ ఉక్కు సిటూ నాయకుడు ఎస్.రామారావు ఆరోపించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే దీక్షల్లో 1,351వ రోజు, గురువారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సహకారంతో ఉద్యమం సాగుతుందని, ఈ ఉద్యమానికి ప్రజల, ఉద్యోగులను దూరం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కుయుక్తులు పన్నుతోందని ఆరోపించారు. ప్రజల దృష్టి మరల్చి ప్రభుత్వ పెద్దల తాబేదారులకు ఉక్కును తాకట్టు పెట్టడానికి విశ్వప్రయత్నాలు సాగిస్తోందన్నారు.

28న మహాధర్నా

ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి ఈ నెల 28వ తేదీన మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు.

కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, మద్దతుదారులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వీఆర్‌ఎస్ పేరుతో చేస్తున్న ప్రచారం, గందరగోళానికి వెంటనే ఫుల్‌స్టాప్ పెట్టాలన్నారు. కార్యక్రమంలో సిటూ నాయకులు గంగాధర్, మొహిద్దీన్, శ్రీనివాస్, బాలశౌరి, కేఆర్‌కే రాజు, మురళి, రామచంద్రమూర్తి, డీసీహెచ్ వెంకటేశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య కోర్సులతో ఉపాధి అవకాశాలు



విద్యార్థికి సర్టిఫికెట్ అందిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ సిటీ: నైపుణ్యం అందించే కోర్సులతో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు పేర్కొన్నారు. ఏయూతో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సెంటర్ నిర్వహించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు గురువారం ఏయూలో సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఏయూ అందించే సర్టిఫికెట్‌కు అమితమైన విలువ ఉంటుందన్నారు. ఈ కోర్సు పూర్తి చేసిన వారు మెరుగైన ఉపాధి అవకాశాలు పొందవచ్చని చెప్పారు. భవిష్యత్తులో ఈ కేంద్రంతో సంయుక్తంగా మరిన్ని కోర్సులు నిర్వహించేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నాక్‌లో ఏయూ అత్యుత్తమ స్థానం సాధించిందన్నారు. ఏయూ అభివృద్ధిని వివరించారు. ప్రత్యేక అతిథి ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ ఓఎస్డీ ఎ.ఎస్.శెట్టి మాట్లాడుతూ ఈ కోర్సుల నిర్వహణకు ఏయూ అందించిన సహకారాన్ని మరువలేమన్నారు. ఏయూతో కలిసి పనిచేయడం తమకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందన్నారు. భవిష్యత్తులో మరిన్ని కోర్సులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ రీజనల్ డైరెక్టర్ బీరేంద్రసింగ్, సీనియర్ సాఫ్ట్ స్కిల్స్ ఫ్యాకల్టీ డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీలో ఫౌండేషన్ కోర్స్ ప్రారంభం



మాట్లాడుతున్న జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి వెంకట శేషమ్మ

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కాలేజీలో తాజా బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థుల కోసం 2 వారాల ఫౌండేషన్ కోర్సు గురువారం ప్రారంభించారు. జిల్లా న్యాయమూర్తి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ఎంవీ శేషమ్మ, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఈస్ట్) లక్ష్మణమూర్తి, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు, అనాటమీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ ఎస్. రవీంద్ర కిషోర్ ఈ సెషన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంవీ శేషమ్మ ర్యాగింగ్ నిరోధక చట్టం, దానిలోని సెక్షన్లు, ప్రధాన నిబంధనలపై విద్యార్థులకు వివరించారు. ర్యాగింగ్‌కు పాల్పడే వారికి విధించే వివిధ శిక్షల గురించి తెలిపారు. సైబర్ క్రైమ్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించడంతో పాటు నార్కోటిక్, సైకోట్రాపిక్ సబ్‌స్టాన్సెస్ యాక్ట్, పోక్సో యాక్ట్, మోటార్ వెహికల్స్ యాక్ట్‌లపై విద్యార్థులకు వివరించారు.

28న ఉక్కు కార్మిక సంఘాల ధర్నా



ధర్నా పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాలు ఈనెల 28న నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు కోరారు. గురువారం సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద ధర్నా గోడపత్రికను ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉక్కు కార్మికుల జీవితాలతో ఆడుకుంటుందన్నారు. దానికి తోడు ఉక్కు యాజమాన్యం రోజుకొక కోత విధించడం ద్వారా కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నదన్నారు.

గతంలో అనేక సదుపాయాలకు కోత విధించగా ఇటీవల హెచ్‌ఆర్‌ఏను తొలగించడం ద్వారా భారీగా నష్టం కలిగించిందన్నారు. ఈ అంశంపై ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కె.ఎస్.ఎన్.రావు, జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, నరేష్‌కుమార్, కారు రమణ, జి. గణపతిరెడ్డి, రమణమూర్తి, వరసాల శ్రీనివాస్, మహాలక్ష్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వీరేశలింగం జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకం



ప్రథమ విజేతకు నగదు బహుమతి అందిస్తున్న ఎంపీ శ్రీభరత్, కళాభారతి ప్రతినిధులు

మద్దిలపాలెం: సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకమని వక్తలు పేర్కొన్నారు. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ కళాభారతి ఆధ్వర్యంలో కందుకూరి వీరేశలింగం పంతులు అంశంపై వ్యక్తిత్వ, వ్యాసరచన పోటీలు స్కూల్, కాలేజీ స్థాయిలో వేర్వేరుగా నిర్వహించారు. విజేతలకు గురువారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో బహుమతుల ప్రదానోత్సవం చేశారు. కళాభారతి అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్.రాజు, కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, ఈట రాంబాబు, ఆచార్య చంద్రశేఖర్, రాజులతో కలిసి ముఖ్య అతిథి విశాఖ ఎంపీ శ్రీభరత్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వీఎండీఏ ప్రతినిధులతో కలిసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వీరేశలింగం వంటి మహనీయుల జీవిత చరిత్రను నేటితరానికి తెలియజేసేందుకు ఇటువంటి పోటీలు మరిన్ని నిర్వహించాలని సూచించారు. కళాభారతి అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ గొప్ప సంఘ సంస్కర్తల గురించి నేటితరానికి తెలిపే ఉద్దేశంతో ఈ పోటీలు ఏర్పాటు చేశామన్నారు. కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ కళాభారతి ఆద్యుడు సి.ఎస్.ఎన్.రాజు అందజేసిన రూ.5 లక్షల ఎండోమెంట్ ఫండ్ మీద వచ్చిన వడ్డీతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొన్న అన్ని విద్యా సంస్థలను అభినందించారు. హైస్కూల్ స్థాయిలో వ్యకృత్వ, వ్యాసరచన పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.3,000, ద్వితీయ బహుమతిగా రూ.2,000, తృతీయ బహుమతిగా రూ.1,000తో పాటు ప్రశంసాపత్రాలు, పుస్తకాలు ప్రదానం చేశారు. ప్రతి కేటగిరీలో ప్రోత్సాహక బహుమతులుగా రూ.500 చొప్పున 9 మంది విద్యార్థులకు అందించారు. కార్యక్రమ వక్త ఆచార్య కట్టమూరి చంద్రశేఖర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వీరేశలింగం జీవిత విశేషాలను వివరించారు. ముందుగా వీరేశలింగం పంతులు సమకూర్చిన ప్రత్యేక పాటపై విశాఖ వాసులు లక్ష్మి సారథ్యంలో ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. కార్యక్రమంలో 6 స్కూళ్లు, 9 కాలేజీల నుంచి 800 మంది వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. సేవలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దళిత క్రిస్టియన్లను ఎస్సీ జాబితాలో చేర్చాలి



మైనార్టీ ఫ్రంట్ చైర్మన్ సుధాకర్‌ను సత్కరిస్తున్న శామ్యూల్, బాబూరావు

సీతంపేట: దళిత క్రిస్టియన్లను ఎస్సీ జాబితాలో చేర్చాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఐ.శామ్యూల్ ఆనంద్ కుమార్, విశ్రాంత ఐపీఎస్ అధికారి డాక్టర్ కూచుపూడి బాబూరావు డిమాండ్ చేశారు. స్థానిక గురుద్వారా కూడలి సమీపంలోని చర్చిలో ఆల్ ఇండియన్ క్రిస్టియన్ మైనార్టీ ఫ్రంట్ చైర్మన్ ఎం.సుధాకర్ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఫ్రంట్ చైర్మన్ సుధాకర్ మాట్లాడుతూ త్వరలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యటించనున్న బాలకృష్ణన్ కమిషన్ దృష్టికి సమస్యను తీసుకెళ్తామన్నారు. 1950లో కేవలం హిందువులలోని ఎస్సీలకు మాత్రమే ఈ రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు. క్రైస్తవం స్వీకరించిన దళితులకు ఎస్సీ హోదా కల్పించాలని కోరుతూ రెండు దశాబ్దాల కిందట సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయన్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో బాలకృష్ణన్ కమిషన్ పర్యటించనున్నందున వారి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అనంతరం క్రిస్టియన్స్ సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్న ఆల్ ఇండియన్ క్రిస్టియన్స్ మైనార్టీ ఫ్రంట్ చైర్మన్ సుధాకర్‌ను ఘనంగా సత్కరించారు.

పర్యావరణ హిత దీపావళిపై అవగాహన



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఎంవీపీకాలనీ: పర్యావరణ హిత దీపావళి లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషియాలని ఏఎస్ రాజా ఉమెన్స్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.కాసు పిలుపునిచ్చారు. గ్రీన్ క్లైమేట్ టీం, సిఫా సంస్థల ఆధ్వర్యంలో గురువారం ఎంవీపీ కాలనీలోని కళాశాల ఆవరణలో విద్యార్థులకు పర్యావరణ హిత దీపావళిపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దీపావళి రోజు వినియోగిస్తున్న మందుగుండు సామగ్రి ద్వారా వాతావరణానికి జరుగుతున్న నష్టాన్ని వివరించారు. పర్యావరణ హితంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు దీపావళి జరుపుకోవాలని సూచించారు. ఈ దిశగా ప్రతి ఇంట్లో అవగాహన పెంచాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, ఆయా సంస్థల ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆయుధ వ్యాపారుల వల్లే యుద్ధాలు



సమావేశంలో ఆచార్య అర్జున తదితరులు

సీతంపేట: యుద్ధాలు నివారించి ప్రపంచంలో శాంతిని స్థాపించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఇస్కఫ్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ భవన్‌లో గురువారం యూఎన్‌వో ఫార్మేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య పి.అర్జున మాట్లాడుతూ ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాలకు ఆయుధ వ్యాపారులే కారణమని, వారంతా అమెరికాలో ఉన్నారని తెలిపారు. ఆయుధాలకు ఖర్చు పెట్టే డబ్బు పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పనకు వెచ్చించాలని కోరారు. ఇస్కఫ్ రాష్ట్ర నాయకులు జె.వి.ప్రభాకర్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలన, ప్రపంచ శాంతి, యుద్ధాల నివారణ లక్ష్యంగా 193 దేశాల భాగస్వామ్యంతో 1945లో యూఎన్‌వో ఏర్పడిందని గుర్తు చేశారు. రష్యా – ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయిల్ – పాలస్తీనా యుద్ధాలతో లక్షలాది మంది చనిపోయారని, తీవ్ర ఆస్తి నష్టం జరిగిందన్నారు. యూఎన్‌వో చొరవ తీసుకుని చర్చల ద్వారా పరిష్కారం చూపి యుద్ధాలు నివారించాలని కోరారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు ఎస్.యు.ప్రసాద్, జంగాలయ్య, రాజేంద్ర ప్రసాద్, బొడ్డు కల్యాణరావు, జీవన్‌బాబు పాల్గొన్నారు.